ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

5

బుధవారం 7 ఆగస్టు 2024



సాహసం చేయాల్సిందే !

ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సిందే.. గోతులు తప్ప రోడ్డు కనిపించని ఈ మార్గంలో వెళ్లాలంటే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. బైక్‌పై వెళ్లేవారు ఫీట్‌లు చేయాల్సిందే.. తణుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లే ఈ రోడ్డు గోతులు పడి అధ్వానంగా తయారైంది. వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

- తణుకు

దంచికొట్టింది..!

తాడేపల్లిగూడెం రూరల్‌, ఆగస్టు 6: జిల్లాలో వర్షం దంచికొట్టింది.. మంగళవారం తెల్లవారుజామున ఏకధాటిగా సుమారు రెండు గంటలపాటు వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల కారణంగానే జిల్లాలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో పంటలు ముంపునకు గురవుతుండగా సార్వా సాగు జోరుగా సాగుతోంది. ఇటీవల భారీగా కురిసిన వర్షాల వల్ల ముంపునకు గురైన పంట పొలాల్లో నీరు ఇంకా తీయక పోవడంతో ఆ ప్రాంతాలలో వరి నారుమళ్ళు, నాట్లు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ వరినాట్లు వేయాల్సిన పరిస్థితి కనిపించిందని పలువురు రైతులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలో 11.5 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదవగా అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 49.2 మి.మీ నమోదైంది. పెనుగొండలో 32.4 మి.మీ, పెంటపాడులో 30.2, ఇరగవరంలో 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నారు. కానీ మార్కెట్‌లో మాత్రం ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం, మరోవైపు ర్యాంప్‌లకు అవకాశం లేకపోవడంతో ఇసుకకు డిమాండ్‌ ఏర్పడింది. దీంతో ఉచిత ఇసుక భారమైంది. దీనిపై ప్రభుత్వ స్థాయిలోనూ తర్జనభర్జనలు పడుతున్నారు.



ఉచిత ఇసుకకు రవాణా భారం

మూడు రోజుల పాటు వాహనాలు నిలుపుదల

లోడింగ్‌లో జాప్యం..రూ. 6 వేలు అధికం

మార్కెట్‌లో లారీ రూ. 19 వేలకు విక్రయం

రీచ్‌లు తెరుచుకుంటే తగ్గుముఖం

ర్యాంప్‌లు అందుబాటులోకి వస్తేనే ఉచిత ఇసుకతో ఊరట

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

మార్కెట్‌లో ప్రస్తుతం లారీ ఇసుక రూ. 18 వేల నుంచి రూ.19 వేలకు విక్రయిస్తున్నారు. వైసీపీ హయాంలో రూ. 15 వేలకు ఇసుక లభ్యమయ్యేది. ప్రైవేటు సంస్థలు వేసవిలో ఇబ్బడి ముబ్బడిగా ఇసుక నిల్వ చేసేవి. మరోవైపు నిర్మాణ రంగం అంతగా లేదు. జిల్లాలో అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు నిలిచి పోయాయి. సొంతిళ్లు నిర్మించుకోవడానికి ఎవరూ సాహసం చేయలేదు. అక్కడక్కడా కొందరు బిల్డర్‌లు మాత్రమే నిర్మాణాలకు సాహసం చేశారు. దాంతో ఇసుకకు డిమాండ్‌ అంతగా ఉండేదికాదు. దానికితోడు ప్రైవేటు ఏజన్సీ ర్యాంప్‌ల్లో ఇబ్బడి ముబ్బడిగా ఇసుక తవ్వకాలు నిర్వహించేది. ఫలితంగా సాధారణ రోజుల్లో రూ.14 వేలకు ఇసుకు దొరికేది. వర్షాకాలం అయితే రూ. 15 వేలకు విక్రయించేవారు. వైసీపీ హయాంలో ప్రభుత్వమే విక్రయించి నప్పుడు అయితే లారీ ఇసుక రూ .25 వేల వరకు అమ్ముడు పోయింది. ప్రయివేటు ఏజన్సీలకు ఇచ్చిన తర్వాత తగ్గుముఖం పట్టింది. అదికూడా అక్రమ రవాణా సాగింది. తీర ప్రాంతంలో వైసీపీ నేతలు అడ్డంగా దోచుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించారు. గతంలో ప్రయివేటు ఏజన్సీలు నిల్వ ఉంచిన స్టాక్‌ పాయింట్‌లలో మాత్రమే ఇసుక లభ్యమవుతోంది. గోదావరి వరదతో రీచ్‌లు మూతపడ్డాయి. ర్యాంప్‌లు అందుబాటులోకి రావాలంటే నవంబరు వరకు వేచి ఉండాలి. అప్పుడే ఇసుక కొరత తీరనుంది. ప్రస్తుతం స్టాక్‌ పాయింట్‌లలోనే ఇసుక లభ్యమవుతోంది. అదికూడా జిల్లాలో ఎక్కడా స్టాక్‌ పాయింట్‌లు లేవు. సిద్ధాంతం వద్ద కొండలు మాదిరిగా ఉన్న ఇసుకన వైసీపీ హయాంలోనే అక్రమంగా విక్రయాలు నిర్వహించేశారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెండ్యాల స్టాక్‌ పాయింట్‌లోనే ఇసుక లభ్యమవుతోంది.

మూడు రోజులకు.. ఒక లారీ

పెండ్యాల స్టాక్‌ పాయింట్‌ వద్ద ఇసుక లభ్యత కావాలంటే మూడు రోజులు వేచి ఉండాల్సి వస్తోంది. దానికోసం లారీ యజమానులు ఒక్కో రోజుకు రూ. 2 వేలు అదనంగా రవాణా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. స్టాక్‌ పాయింట్‌ వద్ద లారీ ఇసుక రూ. 4200లకు లోడింగ్‌ జరుగుతోంది. రవాణా ఛార్జీలు మరో రూ. 6000 వరకు ఉంటాయి. మూడు రోజుల జాప్యానికి మరో రూ.6 వేలు లారీ యజమానులు వసూలు చేస్తున్నారు. దానినే మార్కెట్‌కు తీసుకువచ్చి రూ. 18 వేల నుంచి రూ. 19 వేల మధ్యలో అమ్మకాలు సాగిస్తున్నారు. అదే ర్యాంప్‌లు, రీచ్‌లు తెరచుకుంటే లారీ వెళ్లిన వెంటనే లోడింగ్‌ జరుగుతుంది. ఇసుక మార్కెట్‌కు వస్తుంది. ప్రభుత్వం ఆశించినట్టుగా రూ. 10 వేలకే ఇసుక దొరికే అవకాశం ఉంటుంది.

త్వరలో అందుబాటులోకి రీచ్‌లు

తూర్పుగోదావరి జిల్లాలో త్వరలోనే ఔరంగాబాద్‌, వాడపల్లి రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. అదే జరిగితే ఇసుకకు కొంత డిమాండ్‌ తగ్గుతుంది. ప్రస్తుతం తీపర్రు స్టాక్‌ పాయింట్‌ వద్ద ఇసుక ఉన్నప్పటికీ నిర్మాణానికి అనువుగా ఉండడం లేదు. దాంతో లారీ యజమానులు అక్కడ ఇసుకపై ఆసక్తి చూపడం లేదు. పశ్చిమగోదావరి జిల్లాలో రీచ్‌లు కూడా ప్రారంభం కాలేదు. ర్యాంప్‌లు తెరచుకునేటప్పటికీ మరో మూడు నెలలు ఆగాల్సిందే. అప్పటిదాకా రీచ్‌లే ఆధారం. గడచిన వేసవిలో ఇసుక తవ్వకాలు లేక పోవడంతో ప్రస్తుతం ఆశించిన స్థాయిలో స్టాక్‌ పాయింట్‌ల వద్ద ఇసుక లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్మాణ రంగంపై ఆశలు పెరిగాయి. దాంతో ఇసుక కొనుగోలుకు అంతా సిద్ధమవుతున్నారు. ఉచిత ఇసుక విధానం అమలులో ఉన్నప్పటికీ ధరలు మాత్రం అధికంగా ఉంటున్నాయి. అభివృద్ధి పనులు అంతగా సాగడం లేదు. పట్టణాలు, పంచాయతీలో పనులు నిలిపివేశారు.ధరలు తగ్గుతాయని కాంట్రాక్టర్‌లు ఎదురుచూస్తున్నారు. రీచ్‌లు అందు బాటులోకి వస్తే ఇసుక ధరలు తగ్గే అవకాశం ఉంది. కాంట్రాక్టర్‌లు పనులు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతారు.

గతంలో మెరుగు

గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఉచిత ఇసుక విధానం అమలు చేశారు. దాంతో లారీ ఇసుక రూ. 9 వేల నుంచి రూ. 10 వేలకు దొరికేది. ఇప్పుడు కూడా అదే విధానం అమలు చేస్తున్నారు. కానీ ర్యాంప్‌లు లేవు. రీచ్‌లు పనిచేయడం లేదు. స్టాక్‌ పాయింట్‌ల వద్ద లారీలు క్యూ కడుతున్నాయి. మళ్లీ పాత రోజులు మాదిరిగా ఇసుక లభ్యం కావాలంటే అన్ని రీచ్‌లు, ర్యాంప్‌లు తెరచుకోవాలి. ఇసుక తవ్వకాన్ని కూడా కాంట్రాక్ట్‌ ఏజన్సీలకు అప్పగిస్తే త్వరితగతిన లోడింగ్‌ జరుగుతుంది. లారీ యజమానులు కొనుగోలు చేసి మార్కెట్‌లో విక్రయిస్తారు. అయితే సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో బుక్‌ చేసుకంటే ఇసుక సరఫరా చేసే విధానం కూడా ఉండేది. నిర్మాణ దారులే ఇసుకను బుక్‌ చేసుకుని కొనుగోలు చేసుకునేవారు. ఎలా అయినా సరే ఇసుక తవ్వకాలు పెరిగినప్పుడే కొరత నివారణ సాధ్యపడుతుంది. లారీలు వెళ్లిన వెంటనే లోడింగ్‌ జరుగుతుంది. నిర్మాణదారులు కూడా పరిమితికి మించి ఇసుక కొనుగోలు చేసే అవకాశం ఉండదు. గతంలో నిబంధనలు కఠిన తరంగా ఉన్నప్పుడు ఇసుక నిల్వ చేసుకునేవారు. దాంతో డిమాండ్‌ ఏర్పడేది. అలా కాకుండా ఇసుక తవ్వకాలు పెరిగితే సరఫరా సవ్యంగా ఉంటుంది. ఎప్పుడైనా ఇసుక లభ్యత ఉంటే ఇసుక నిల్వలకు ఆస్కారం ఉండదు. ప్రభుత్వం ఆశించినట్టుగా ధరలు తగ్గుతాయి.

పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కండి

కలెక్టర్‌ నాగరాణి



భీమవరం టౌన్‌, ఆగస్టు 6 : మనదేశంలో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజల అభిప్రాయాలను తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్‌లో ఓటు వేయాలని జిల్లా కలెక్టర్‌ చదలవాడ నాగరాణి కోరారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దేఖో అప్నా దేశ్‌ - పీపుల్స్‌ ఛాయిస్‌-2024 అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఆధ్యాత్మికం, సంస్కృతీ వారసత్వం, ప్రకృతి-వన్య ప్రాణులు, సాహస కార్యకలాపాలు, తదితర కేటగిరీలలో అత్యుత్తమ పర్యాటక ఆకర్షణలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించడం ద్వారా ప్రపంచస్థాయి పర్యాటకం అభివృద్ధి చేయడం దీని లక్ష్యం అన్నారు. దీనిలో భాగంగా mygov ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక వెబ్‌పేజీ అభివృద్ధి చేశారని, ప్రజలు వివిధ కేటగిరీలలో తమకు ఇష్టమైన పర్యాటక ప్రదేశాలను సూచిస్తూ ఓటు వేయడానికి ఈ లింక్‌ ద్వారా అవకాశం కల్పించారన్నారు. ప్రజా భాగస్వామ్యాన్ని పెంచేందుకు దీనిపై ప్రచారం చేపట్టామన్నారు. ప్రపంచ పర్యాటకాన్ని మనదేశంలో పెంపొందించే దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రజలు తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా తెలియ జేయాలని కలెక్టర్‌ కోరారు.

రుచిగా..శుచిగా..

స్ట్రీట్‌ ఫుడ్‌ వ్యాపారులకు 8,9 తేదీల్లో శిక్షణ



భీమవరం టౌన్‌, ఆగస్టు 6 : సాయంత్రమైతే పట్టణాల్లో స్ట్రీట్‌ ఫుండ్‌ సెంటర్లు కిటకిటలాడుతూ ఉంటాయి. పేద ధనిక భేదం లేకుండా అంతా అక్కడకు చేరి తమకిష్టమైనవి లాగించేస్తుంటారు. అయితే చాలామంది అవి ఎంతవరకు సురక్షితమైనవి అనేది పెద్దగా పట్టించుకోరు. వీధి వ్యాపారులు అందించే ఆహారంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఎన్‌ఎఎస్‌వీఐ సంస్థ ఆహార భద్రతశాఖ, మెప్మా ఆధ్వర్యంలో 8,9 తేదీల్లో భీమవరంలో శిక్షణ ఇవ్వనున్నారు. నేషనల్‌ అసోసియేషన్‌ స్ట్రీట్‌ వెండర్స్‌ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ ఈ శిక్షణా కార్యక్రమం చేపట్టింది. ఈ ఏడాది కాకినాడ, రాజమండ్రి, అనకాపల్లి కార్పొరేషన్లలో వీధి వ్యాపారులకు శిక్షణ ఇచ్చారు. మునిసిపాల్టీకి సంబంధించి భీమవరాన్ని ఎంపిక చేశారు. వీధి ఆహార పదార్థాలు విక్రయించేవారికి అవగాహన కల్పిస్తారు. అమ్మకాలు పరిశుభ్రంగా ఉంచటం ఎలా ? వండేందుకు సురక్షిత నీటిని ఉపయోగించడం, మాంసాహార, శాఖాహార పదార్థాలను వేర్వేరుగా ఉంచడం, శుభ్రమైన యూనిఫాం ధరించడం, ఆహారాన్ని తాకేముందు చేతులను శుభ్రం చేసుకోవడం తదితర 12 అంశాలపై శిక్షణ ఇస్తారు. వీధి వ్యాపారులు కూడా ఫుడ్‌ సేఫ్టీ స్టాండర్డ్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా లైసెన్స్‌ కలిగి ఉండాలి. శిక్షణ తీసుకునే వ్యాపారులకు ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా సర్టిఫికెట్‌ను అందిస్తారు. ఈ కార్యక్రమాన్ని స్పాన్సర్‌ చేస్తున్న నెస్లే కంపెనీ శిక్షణ పొందిన వీధి వ్యాపారులకు ఆప్రాన్‌, గ్లౌజులు, టోపీ, తదితర వస్తువులను అందిస్తుంది. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నారు. శిక్షణ సమయంలో ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్ల ద్వారా శిక్షణ ఇస్తారు. కల్తీ వస్తువులను ఎలా గుర్తించాలి ? వినియోగదారులకు రుచికరమైన, శుభ్రమైన ఆహార పదార్థాలు ఎలా అందించాలి ? వ్యాపారం చేసే ప్రాంతం ఎలా శుభ్రంగా ఉంచాలి అనేదానిపై అవగాహన కల్పిస్తారు. రోజుకు 125 మందికి శిక్షణ ఇచ్చేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. మునిసిపాల్టీల సహకారం తీసుకుని ఈ శిక్షణ నిర్వహిస్తారు.


చిట్టీల పేరుతో మోసం

రూ.4 కోట్లకు టోకరా

15 నుంచి క్యాన్సర్‌పై సర్వే

టిడ్‌కో ఇళ్ల సముదాయంలో గ్యాస్‌ ప్రమాదం

బాలింత మృతి



7

భీమవరం డీఎస్పీగా జయసూర్య



భీమవరం క్రైం,ఆగస్టు 6 : ప్రజలకు పోలీసులకు మధ్య ఫ్రెండ్లీ వాతావరణాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేయాలని భీమవరం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జయసూర్య సీఐలకు సూచించారు. మంగళవారం పట్టణ సీఐలు నాగరాజు, కాళీచరణ్‌లు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

17 నుంచి 20 వరకూ శ్రీవారి దివ్యపవిత్రోత్సవాలు

ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు



ద్వారకాతిరుమల, ఆగస్టు 6 : చిన్నతిరుమలేశుని దివ్యపవిత్రోత్సవాలు శ్రీవారి సన్నిధిలో ఈ నెల 17 నుంచి 20 వరకూ నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహిం చననట్లు ఆలయ ఈఓ విత్రినాధరావు తెలిపారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసీ తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ఏటా వీటిని నిర్వహించడం సంప్రదాయబద్ధమైంది. ఉత్సవాల్లో భాగంగా 17 సాయంత్రం అంకురార్పణ, 18న పవిత్రాధివాసం, 19న పవిత్రారోపణ, 20న జరిగే శ్రీమహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాలు జరిగే ఆయా రోజుల్లో శ్రీవారి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈఓ వివరించారు.

రోహిత్ వర్మకు బాడీ బిల్డింగ్‌లో 5వ ర్యాంక్



రోహిత్‌వర్మను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 6 : స్థానిక శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం బీబీఏ చదువుతున్న విద్యార్థి చింత రోహిత్‌వర్మకు స్టేట్ లెవల్ మిస్టర్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్-2024లో 5వ ర్యాంక్ వచ్చిందని కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో రోహిత్‌వర్మను మంగళవారం ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.సురేష్, అధ్యాపకులు, సిబ్బంది రోహిత్‌వర్మను అభినందించారు.

15 నుంచి క్యాన్సర్ పై సర్వే

భీమవరం టౌన్, ఆగస్టు 6 : క్యాన్సర్ కేసులను ముందుగానే గుర్తించేందుకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ నెల 15 నుంచి క్యాన్సర్ గుర్తింపు సర్వే చేపట్టనున్నారు.ప్రజలకు క్యాన్సర్‌పై అవగామనకల్పించటంతోపాటు వ్యాధినిర్ధరాణ పరీక్షలు కూడా చేయనున్నారు. జిల్లాలో మొత్తం జనాభ 19 లక్షల 83 వేల 908 మంది జనాభా ఉన్నట్లుగా నిర్ధారించారు. ఇందులో 30 ఏళ్ల పైబడి 9 లక్షల 52 వేల 275 మందిని సర్వే చేయానున్నారు. ఏఎన్ఎంలు ఎమ్‌హెచ్‌ఓలు సీహెచ్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై వివరాలు సేకరించనున్నారు. ఈ సర్వేలో వచ్చిన వివరాలు ఆధారంగా లక్షణాలుంటే వాటిని ఎస్‌గా గుర్తించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ సర్వే కోసం ఇప్పటికే అధికారులకు, సిబ్బందికి శిక్షణ కూడాపూర్తి చేశారు. 100 మంది మెడికల్ ఆఫీసర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు కలిపి 603 మందితోపాటు మరో ఆరుగురికి శిక్షణ ఇచ్చారు. సర్వేకు కన్వీనర్‌గా డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు వ్యవహరించనున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్‌గా డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి పర్యవేక్షించనున్నారు. ఇందులో వివరాలు త్వరలో తెలియనున్నాయి.

'మిగులు' ఎక్కువ - 'కొరత' తక్కువ

- 'పని సర్దుబాటు' ప్రభావం సగం మంది టీచర్లపైనే ?!
- స్కూల్ అసిస్టెంట్లుగా ఎస్జీటీల నియామకం



ఏలూరు అర్బన్, ఆగస్టు 6 : టీచర్ల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ (పని సర్దుబాటు) ప్రభావం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు సగం మందిపై మాత్రమే పడుతుందని ప్రాథమిక సంకేతాలు వస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతను నివారించేందుకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను ప్రభుత్వం చేపట్టిన విషయం విదితమే. ఆ మేరకు ఈ నాలుగో తేదీని ప్రామాణికంగా తీసుకుని పాఠశాలల్లో ఉపాధ్యాయుడు, విద్యార్థుల సంఖ్య నిష్పత్తిని లెక్కగట్టి మిగులు (సర్‌ప్లస్) టీచర్లను కొరతవున్న స్కూళ్ళకు సర్దుబాటు చేయడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం(టిస్) అప్‌డేట్ ప్రక్రియను ముగించగా, ఆ డేటాను డీఈవోలు కన్ఫర్మ్ చేసేపని మంగళవారం జరిగింది. ఇక పాఠశాలలవారీగా ప్రభుత్వం వద్ద ఉన్న యూడైస్ డేటాను అప్‌డేట్ చేసి సంబంధిత స్కూలులో ఖచ్చితంగా ఉన్న విద్యార్థుల సంఖ్యను తేల్చనున్నారు. ఇది ముగిసిన వెంటనే వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను చేపడతారు. ఆ ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం సుమారు 1400 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్‌గా ఉన్నట్టు ప్రాథమిక అంచనాగా ఉంది. తుది లెక్కల ప్రకారం ఈ సంఖ్యలో కొద్దిపాటి మార్పులు ఉండవచ్చు. వీరందరినీ కొరతవున్న పాఠశాలలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద సర్దుబాటు చేయడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 652కి మించి అన్ని కేడర్లలోనూ లేవు. అంటే దాదాపు సగం మందిని సర్దుబాటు చేయడానికి వీలు ఉండక పోవచ్చునని భావిస్తున్నారు. ఇక సెకండ్ మెథడాలజీ ప్రకారం ఎస్జీటీలనే స్కూల్ అసిస్టెంట్లుగా ఆయా సబ్జెక్టుల్లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద సర్దుబాటు చేద్దామనుకున్నా దాదాపు సగం మంది వర్కింగ్ ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్‌లకు పని సర్దుబాటును వర్తింపజేయడం సాధ్యంకాక పోవచ్చునని తెలుస్తోంది. ఇలా సర్‌ప్లస్‌గా గుర్తించిన టీచర్లను ఆయా మండలాలవారీగా సర్దుబాటు చేయడానికి ప్రాధాన్యతా క్రమంలో తొలుత మండల పరిధి, ఆ తర్వాత సమీప మండలం, ఆ తదుపరి డివిజన్, జిల్లా పరిధిలో నియమించేందుకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానాన్ని అనుసరించనున్నట్టు సమాచారం. ఈ నెల 15 తర్వాతే వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియ కార్యరూపం దాల్చుతుందని భావిస్తున్నారు. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సర్‌ప్లస్‌గా గుర్తించే వర్కింగ్ ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లలో దాదాపు సగం మందిపై మాత్రమే ప్రభావం చూపుతుం దని, మిగతా వారంతా ఎక్కడివారక్కడే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు ఉంటాయని సమాచారం. అయితే దీనికి సంబంధించి ఇంతవరకు అధికారిక ప్రకటన లేవీ లేవు.

86.25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

దేశవరం వద్ద 75 క్వింటాళ్లు, కొప్పులవారిగూడెం 11.25 క్వింటాళ్లు



దేశవరంలో పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

చింతలపూడి, ఆగస్టు 6: విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారంతో చింతలపూడి మండల దేశవరం గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున దాడి చేసి అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన 75 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాల నుంచి రేషన్ బియ్యాన్ని ఒక లారీలోకి లోడ్ చేస్తుండగా గుర్తించి పట్టుకున్నామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. మూడు లక్షల విలువైన బియ్యం, రూ.24 లక్షల విలువ గల వాహనాలను సీజ్ చేసి, ఆరుగురి పై కేసు నమోదు చేశామని తెలిపారు. కాకినాడకు చెందిన సామిరెడ్డివీరవెంకట్రావు, బుజ్జి, దేశవరం గ్రామానికి చెందిన కటారి చెన్నారావు, చోడిశెట్టి మహేష్, చోడిశెట్టి సతీష్, ఆకుల వీరబాబుపై కేసులు నమోదు చేశామన్నారు. చింతలపూడి సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ జరీనా, వీఆర్వోలు పాల్గొన్నారు.

● పెదవేగి : అక్రమంగా తరలిస్తున్న 11.25 క్వింటాళ్ళ రేషన్ బియ్యంను, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ తెలిపారు. కూచింపూడి నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారనే విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్‌కు వచ్చిన సమాచారంతో కొప్పులవారిగూడెం దగ్గర బొలేరో వ్యాన్‌ను తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 11.25 క్వింటాళ్ళ రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశామని సీఐ తెలిపారు. బియ్యం తరలిస్తున్న తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడేనికి చెందిన ఉన్నమట్ల వెంకటరమణను ప్రశ్నించగా పెదవేగి మండలం కూచింపూడికి చెందిన కొనకళ్ళ రాంబాబు దగ్గర రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, నల్లజర్ల పరిసర ప్రాంతాల్లో చేపల చెరువులు, కోళ్ళఫారాలకు తరలిస్తున్నట్లు చెప్పాడని సీఐ తెలిపారు. బియ్యం విలువ రూ.46 వేలు కాగా బొలేరో వ్యాన్ విలువ రూ. నాలుగు లక్షలు ఉంటుందన్నారు. దీనిపై రేషన్ బియ్యం అక్రమంగా విక్రయిస్తున్న రాంబాబుతోపాటు కొప్పులవారిగూడేనికి చెందిన ఉప్పులూరి చిరంజీవి అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని సీఐ రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో సివిల్ సప్లయ్ ఏఎస్‌వో వై.ప్రతాప్‌రెడ్డి, వీఆర్వో అమర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

ఏలూరు క్రైం, ఆగస్టు 6 : ఏలూరులో గతేడాది ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలను మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ మంగళవారం ప్రారంభమయ్యాయి. 2023 ఏప్రిల్ 26న ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. ఎంబీబీఎస్ 150 సీట్లకు అనుమతి లభించడంతో గతేడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఏలూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనంలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. 150 మంది విద్యార్థులు ఎంబీ బీఎస్ విద్యను అభ్యసిస్తున్నారు. మొదటి సంవత్సరంలో అనాటమి, ఫిజియా లజీ, బైయో కెమిస్ట్రీ సబ్జెక్టలపై తరగతులు నిర్వహించారు. ఒకొక్క సబ్జెకు రెండు పేపర్లు వంతున విద్యార్థులు ఫైనల్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ పరీక్షలు మెడికల్ కళాశాలలోనే ప్రారంభమ య్యాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజు విడిచి రోజు ఈ నెల 16 వరకూ పరీక్షలు జరుగనున్నాయి. అనంతరం 19 నుంచి 24 వరకూ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నిర్వహించ నున్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ పరీక్షలను పరిశీలించారు.

క్యాంపస్ మార్పునకు 829 మంది దరఖాస్తు

నూజివీడు టౌన్, ఆగస్టు 6: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు 829 మంది తమను వేరే క్యాంపస్‌కు బదిలీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్జీయుకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత వివిధ క్యాంపస్‌లలో 753 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయని వాటికి ఈ నెల 9 నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్సిటీ చరిత్రలో తొలిసారి క్యాంపస్ మార్పునకు అవకాశం ఇవ్వగా ఆర్‌కే వ్యాలీ నుంచి 45 మంది, ఒంగోలు నుంచి 451, శ్రీకాకుళం నుంచి 329 మంది, నూజివీడు నుంచి కేవలం నలుగురు విద్యార్థులు వేరే క్యాంపస్‌లకు తమను బదిలీ చేయాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదే సందర్భంలో మొదటి విడతలో కౌన్సెలింగ్‌కు హాజరు కాలేకపోయిన 37 మంది విద్యార్థులు తమకు మరోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇవ్వాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

'కుటుంబ కలహాలను సొసైటీకి ఆపాదిస్తున్నారు'

పెదవేగి, ఆగస్టు 6 : పెదవేగిలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో నిధుల స్వాహా ఆరోపణలో వాస్తంలేదని సొసైటీ కార్యదర్శి ఆర్ఎస్వీ ప్రసాద్ వివరించారు. చనిపోయిన వ్యక్తి పేరుతో సొసైటీలో రుణం తీసుకుని, నిధులను స్వాహా చేశారంటూ మృతుని కుమారుడు తిప్పాభట్ల సత్యనారాయణ ఏలూరు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై సొసైటీ కార్యదర్శి మాట్లాడుతూ మృతిచెందిన తిప్పాభట్ల శ్రీరామచంద్ర మూర్తి(పెద్దరాముడు), గతంలో సొసైటీ కార్యదర్శిగా పని చేసిన తిప్పాభట్ల శ్రీరామచంద్రమూర్తి(చిన్నరాముడు)కు మధ్య కుటుంబపరమైన వివాదాలు ఉన్నాయన్నారు. పెద్దరాముడు 2010లో రూ.25 వేలు పంట రుణం తీసుకున్నారని, అతను 2020 ఫిబ్రవరిలో మృతి చెందారని చెప్పారు. మృతుని కుమారుడు సత్యనారాయణ తన తండ్రి పేరుతో ఉన్న ఆస్తి పత్రాలను తన పేరున మార్చుకుంటానని, అంతవరకు సొసైటీలో నడుస్తున్న పంట రుణాన్ని కొనసాగించాలని సొసైటీ కార్యదర్శి, మృతునికి అన్నవరుస అయ్యే చిన్నరాముడుతో చెప్పాడని, దీంతో సోదరుని కుమారుని ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చిన్నరాముడు పంట రుణాన్ని తిరిగి రెన్యువల్ చేశారని ప్రసాద్ వివరించారు. ఈలోగా ఇంటి స్థలం విషయంలో సత్యనారాయణకు చిన్నరామునికి మధ్య వివాదం నెలకొనడంతో దానిని సొసైటీకి ఆపాదిస్తూ సొసైటీ ప్రతిష్టకు భంగం కలిగించే రీతిలో మృతుని కుమారుడు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయంలో సొసైటీకి ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

నీటి పారుదల వ్యవస్థను ప్రక్షాళన చేయాలి



జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డీఆర్‌వో ఉదయ్ భాస్కర్‌కి వినతిపత్రం అందజేస్తున్న గంగరాజు, బాబ్జి

భీమవరం రూరల్, ఆగస్టు 6 : ధాన్యం బకాయిలను విడుదల చేసి, నీటి పారుదల వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే రైతాంగానికి మనుగడ లేదని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట గంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల్లో రైతుల సమస్యలపై మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. భీమవరంలో పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డీఆర్‌వో పి.ఉదయ్ భాస్కర్‌కి కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు దాసరి బాబ్జి బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ధాన్యం బకాయిలు పూర్తిస్థాయిలో బకాయిలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా జిల్లా వ్యాప్తంగా సాగు, మురుగునీటి పారుదల వ్యవస్థ రైతును సర్వ నాశనం చేసిందన్నారు. కనీసం తూడు, గుర్రపు డెక్క, కిక్కిస తొలగించలేదని గంగరాజు మండిపడ్డారు. కాలువలు, గేట్లు, లాకులు, సైపన్లు మరమ్మతులు కూడా చేపట్టలేదన్నారు. ఇరిగేషన్ సొసైటీలను పునరుద్ధరించి ప్రతి కాలువను ఆధునికీరించాలని, ఆక్వా, కొబ్బరి రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ మోర్చా తరుపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు కొల్లి వెంకట్రావు, తిరుమాని వెంకటేశ్వరరావు, ప్రభుత్వ కార్యదర్శి పులపర్తి నాగరాజు, అడ్డగర్ల గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతి

- తమలోపం లేదంటున్న వైద్యాధికారిణి
- టి.నరసాపురం పీహెచ్‌సీ వద్ద కుటుంబీకుల ధర్నా
- విచారణ చేస్తాం : ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో నాగేశ్వరరావు



మృతదేహంతో టి.నరసాపురం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు, మృతురాలు అలివేలుమంగ (ఫైల్)(ఇన్‌సెట్)

టి.నరసాపురం, ఆగస్టు 6 : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా సరైన సమయంలో సరియైన వైద్యం అందక బాలింత వగ్గెల అలివేలు మంగ(23) మృతి చెందింది. ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహించిన కుటుంబీకులు ప్రభుత్వాస్పత్రి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ధర్నా చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులతో, వైద్యులతో చర్చించారు. మృతురాలి భర్త రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటన పై కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అల్లూరి సీతారామరాజు మెట్ట గ్రామానికి చెందిన వగ్గెల అలివేలు మంగ(23)కు గత జూలై 27న జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్ జరిగి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ నెల 5వ తేదీన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అదే రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆమె అనారోగ్య పరిస్థితుల కారణంగా టి.నరసాపురం పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చింతలపూడి ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. బంధువులు ఆమె బౌతిక కాయంతో టి.నరసాపురం పీహెచ్‌సీ దగ్గర ధర్నాకు దిగారు.

వైద్యులే కారణం : భర్త ఆరోపణ

వైద్యుల నిర్లక్ష్యమే అలివేలు మంగ మృతికి కారణమని మృతురాలి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతదేహంతో ప్రభుత్వాస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మృతురాలి భర్త రాము మాట్లాడుతూ తెల్లవారుజామున అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య అలివేలు మంగను ఆస్పత్రికి తీసుకువెళ్ళగా ఆస్పత్రి గేటు వేసి ఉందని, ఎంతసేపు గేట్లు బాదినా ఎవరూ స్పందించలేదన్నారు. 15 నిమిషాల తరువాత గేటు తోసుకుని లోపలికి వెళ్లి వాచ్‌మెన్‌ని లేపామన్నారు. దీంతో స్టాఫ్ నర్సు వచ్చిందని ఎటువంటి వైద్య సహాయం చేయలేదన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో వైద్యం అందించలేదని అందుకే తన భార్య చనిపోయిందని రాము చెబుతున్నారు. కాగా బాధితులకు సీపీఎం నాయకులు మద్దతు పలికారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన కారులతో చర్చించారు. మృతురాలి భర్త రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి తరలించారు. విషయం తెలుసుకున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తక్షణం స్పందించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో మాట్లాడారు. సంఘటన పై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

మా సిబ్బంది నిర్లక్ష్యం లేదు

అయితే వైద్య సహాయం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం లేదని పేషెంట్‌ని తీసుకొచ్చిన తరువాత స్టాఫ్‌నర్సు కొన్ని పరీక్షలు చేసి సెలైన్ పెట్టేందుకు ప్రయత్నించేలోపు కుటుంబీకులు పేషెంట్‌ని తీసుకువెళ్ళి పోయారని, మళ్ళీ గంట తరువాత వచ్చారని మండల వైద్యాధికారి కల్పనారాణి చెబుతున్నారు. కాగా సమాచారం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో నాగేశ్వరరావు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు చేపడతామన్నారు.

బాలికపై లైంగిక దాడి యత్నం అమానుషం

దోషిని కఠినంగా శిక్షిస్తాం : మంత్రి పార్థసారథి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, ఆగస్టు 6: అభం శుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడికి యత్నించటం అమానుషమని, దోషిని కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను, కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చిన్నారి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. సంఘటన గురించి తెలిసిన వెంటనే జిల్లా యంత్రాంగాన్ని, పోలీస్ ఉన్నతాధికారులను దోషులను పట్టుకోవాలని ఆదేశించామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత కూడా ఈ విషయంపై వెంటనే స్పందించి పోలీస్ అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారన్నారు. బాలికకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పినట్టు మంత్రి వివరించారు.

లారీ క్లీనర్ దుశ్చర్య...

నూజివీడు మండలంలోని ఒక గ్రామంలో బాలికను అపహరించి అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడిని సోమవారం రాత్రి నూజివీడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు జిల్లా మాచర్ల నుంచి ధాన్యం కొనుగోలు నిమిత్తం ఆదివారం ఒక లారీ గ్రామానికి వచ్చింది. లారీ డ్రైవర్, క్లీనర్ జయరావు మధ్య ఏదో విషయంపై గొడవ జరిగి, క్లీనర్ ఆదివారం మధ్యాహ్నం లారీ దగ్గర నుంచి వెళ్ళిపోయాడు. అదేరోజు రాత్రి 2 గంటల సమయంలో బాలిక నివాస గృహం సమీపంలో క్లీనర్ జయరావు ఒక సంచితో నడిచి వెళుతున్న దృశ్యం సమీపంలోని ఒక సీసీ కెమెరాలో రికార్డు అయి ఉంది. దీని ఆధారంగా వచ్చిన పని పూర్తికాకపోవడంతో గ్రామంలోనే ఉన్న డ్రైవర్ నుంచి క్లీనర్ సమాచారంను పోలీసులు సేకరించారు. నిందితుడు రెంటచింతలలో ఉన్నట్టు గుర్తించి సోమవారం రాత్రి అక్కడికి వెళ్ళి నిందితుడిని అదుపులోకి తీసుకుని నూజివీడు తీసుకువచ్చినట్లు సమాచారం. నిద్రిస్తున్న బాలికను నిందితుడు అపహరించి సమీపంలోని పామాయిల్ తోటలోకి తీసుకుని వెళ్ళి కాళ్లపట్టీలు లాక్కుని బాలికను వివస్త్రను చేసి కొట్టి, పక్కనే ఉన్న ముళ్ళకంచెలోకి విసిరి వెళ్ళినట్టుగా సమాచారం చక్కర్లు కొడుతోంది. గాయాలపాలైన బాలిక ఏడుస్తూ రహదారిపైకి రాగానే సమీప నివాస గృహంలో ట్రాక్టర్ పనిచేసుకుంటున్న ఒక రైతు గమనించి బాధిత బాలికకు తన మనుమరాలి గౌను తొడిగి ఆమె ఇంటికి చేర్చాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు వచ్చి బాలికను నూజివీడు ఆస్పత్రికి అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తగిన సాక్ష్యాధారాలతో నిందితుడిని అరెస్టుచేసి మంగళవారం రాత్రి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్టు విశ్వసనీయ సమాచారం. మరోవైపు దోషిని కఠినంగా శిక్షించాలని నూజివీడు ఐద్వా మహిళా సంఘం, ఏపీ రైతు సంఘం నాయకులు నూజివీడు ఆర్డీవో భవానీ శంకరికి మంగళవారం వినతి పత్రం అందించారు.

క్రైం కార్నర్

పాముకాటుకు యువకుడి మృతి

ఉండి ఆగస్టు 6: పాముకాటుతో అస్సాంకు చెందిన యువకుడు మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఉండి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి. ఉండి మండలం పాములపర్రుకు చెందిన నక్కా వెంకటప్పకు చెందిన చెరువుల మీద అస్సాంకు చెందిన యువకుడు చామ్లు బాసుమత్రి పనిచేస్తు న్నాడు. సోమవారం రాత్రి చెరువుల వద్ద కాపల ఉన్న అతడు పాముకాటుకు గురయ్యాడు. వైద్యం నిమిత్తం భీమవరంలోని ఆస్పత్రికి తరలించారు. వైద్యం పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు.

కిటికీ మీదపడి బాలిక మృతి

జీలుగుమిల్లి, ఆగస్టు 6 : చర్చి నిర్మాణంలో ప్రమాద వశాత్తు కిటికీ మీద పడి బాలిక మృతి చెందిన ఘటన లక్ష్మీపురంలో జరిగింది. గ్రామానికి చెందిన రేపాకుల కనకారావు, నాగలక్ష్మీ దంపతుల మూడేళ్ల కుమార్తె గ్రామంలో చర్చి నిర్మాణ పనులు జరుగుతుండగా మంగళవారం అక్కడ వెళ్లింది. ప్రమాదవశాత్తు గోడకు ఉంచిన సిమెంట్ కిటికీ(పూర్తి నిర్మాణం కాని) మీద పడింది. తలకు తీవ్ర గాయమైంది. దీంతో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో విజయవాడ తీసుకెళ్లగా పరిస్థితి విషమించి బాలిక(3)మృతి చెందింది. బాలిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

అట్రాసిటీ కేసులో తొమ్మిది మంది అరెస్టు

పాలకోడేరు, ఆగస్టు 6 :పాతకక్షల నేపథ్యంలో కొట్టి, గాయపరిచి, అవహేళన చేసిన తొమ్మిది మంది పై బాధితుడు కంకిపాటి అభి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి మంగళవారం డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో వారిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పాలకోడేరు ఏఎస్సై మోహనరావు తెలిపారు. ఈ నెల 4న పాలకోడేరుకు చెందిన కంకిపాటి అభిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన గుండు బోయిన గణేష్, గుత్తుల సాయిపవన్, చందు, దుర్గాప్రసాద్, వాసు, ప్రభు కిరణ్, కృష్ణ, చంద్రం, సాయిరామ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని కోర్టుకు తరలించినట్లు ఏఎస్సై చెప్పారు.

మద్యం మత్తులో దాడి.. నలుగురిపై కేసు

అత్తిలి, ఆగస్టు 6 : మంచిలి కొత్త కాలనీలో నివసిస్తున్న చల్లా అయ్యప్ప అనే వ్యక్తిని మద్యం మత్తులో కొట్టారని ఆరోపణపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఏఎస్ఐ ఎన్.వెంకట్రావు తెలిపారు. అయ్యప్ప ఇంటి ముందు కుక్క ఒకటి వచ్చి పాడుచేస్తుండగా దానిని అయ్యప్ప తిట్టాడు. అదే సమయంలో ఆ దారిన వెళుతున్న కౌరు వెంకట్, సహదేవుడు, రమణ, సత్తి అనే వారు తమను ఎందుకు తిడుతున్నావంటూ కొట్టారని ఇంటి కిటికీ అద్దాన్ని పగుల కొట్టారని, వెంకట్ కర్రతో కూడా కొట్టాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రాణభయంతో ఇంట్లోకి వెళ్ళిపోగా అయ్యప్పను సోదరుడు గణపతి రక్షించి తణుకు ఆస్పత్రిలో చేర్చారన్నారు. ఆస్పత్రి నుంచి వచ్చి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకట్రావు తెలిపారు.

అగ్నిప్రమాదంలో భర్త, భార్య, కుమార్తెకు తీవ్రగాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 6: తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారం టిడ్కో ఇళ్ల సముదాయంలో గ్యాస్ లీకేజి ఘటనలో కుటుంబంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టిడ్కో ఇంట్లో నివాసముంటున్న తాపీ పని చేసే తాడేపల్లిగూడెంకు చెందిన బోడపాడు మురళి ఇంట్లో సోమవారం రాత్రి గ్యాస్ లీకవ్వడం గమనించని భార్య కుమారి ఉదయం లేచి లైటు వేసే ప్రయత్నం చేయగా వెంటనే స్పార్క్ వచ్చి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాదం మరింత తీవ్రంగా మారింది. ఈ ఘటనలో మురళితో పాటు భార్య కుమారి, కుమార్తె నీలిమలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మురళి, కుమారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ ప్రమాద తీవ్రతకు వేసిన తలుపులు పగిలిపోయాయి. రూరల్ సీఐ రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రి వద్ద చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనయులు రాజేష్ పరామర్శించి వారికి భరోసా కల్పించారు.

మద్యం కోసం ఒకరిపై దాడి

ఏలూరు క్రైం, ఆగస్టు 6 : చాలిచాలని మద్యం ఇప్పించావంటూ ఒక వ్యక్తిపై మరో వ్యక్తి దాడిచేసి గాయపరిచాడు. ఏలూరు కొత్తపేటనకు చెందిన బత్రిపాడి మురళీ కృష్ణ, ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని ఒక బార్ వద్ద అతని స్నేహితుడు భార్గవ్ తో కలిసి మద్యం తాగారు. ఆ మద్యాన్ని మురళీకృష్ణయే కొనుగోలు చేశారు. తాగిన మద్యం చాల లేదని ఇంకా ఇప్పించాలంటూ భార్గవ్ అడిగాడు. మురళీకృష్ణ తన వద్ద డబ్బులు లేవని చెప్పగా గొడవ పెట్టుకున్న భార్గవ్ వెంటనే బీరుసీసా తీసుకుని మురళీకృష్ణపై దాడి చేశాడు. దీంతో అతని తల పగిలింది. అతని వద్ద ఉన్న డబ్బులు కూడా తీసుకుని మద్యం కొనుగోలు చేసుకుని వెళ్ళిపోయాడని బాధితుడు చెప్తున్నా డు. గాయాలతో ఉన్న అతనిని బంధువులు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

డెంగీతో గిరిజనుడి మృతి

చింతలపూడి, ఆగస్టు 6: నాగిరెడ్డిగూడెంకు చెందిన పుచ్చా సీతారాముడు (35) అనే గిరిజనుడు జ్వరంతో మంగళవారం రాత్రి చనిపోయాడు. పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతడిని వారం రోజుల క్రితం గుంటూరు ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకువెళ్ళారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. అయితే డెంగీ జ్వరం వల్ల మృతి చెందాడని గ్రామస్తులు చెబుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నాగిరెడ్డిగూడెంలో సీతారాముడు డెంగీతో మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఏలూరు ఎంపీ పుట్టామహేష్‌కుమార్ స్పందించారు. గ్రామంలో పారిశుద్యం లోపించిందని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమం గా లేకపోవడం, దోమలు వ్యాపించి జ్వరాలు బారిన పడుతున్నారని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీని ఆదేశించారు.

సాధారణ స్థితిలో ఇన్‌ఫ్లూయెంజా కేసులు

ఆకివీడు రూరల్ ఆగస్టు 6 : ఆకివీడు మండలంలోని ఇన్‌ఫ్లూయెంజా కేసులన్నీ సాధారణ స్థితిలో ఉన్నాయని జిల్లా ఉపా వైద్య ఆరోగ్యశాఖాధికారి వి.ప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం అజ్జమూరు, కోళ్లపర్రు, ఆకివీడు గ్రామాలలో అనుమానిత లక్షణాలు కలిగిన వారిని పరిశీలించారు. వారికి ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని తెలిపారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులు రమేష్, వెంకటరాజు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బైకులు ఢీ : ఒకరికి గాయాలు

అత్తిలి, ఆగస్టు 6 : స్థానిక మట్టపర్తి గరువు వద్ద వేగంగా బైకు నడుపుతూ అత్తిలికి చెందిన చిటిరి హరిబాబు నడుపుతున్న బైకును ఢీ కొట్టడంతో బైక్ వెనుక ఉన్న చిటిరి శ్రీనివాస్ (55) గాయపడ్డాడు. శ్రీనివాస్ కుమారుడు హరిబాబుతో కలిసి అత్తిలి గాంధీనగర్ నుంచి పొలం వెళుతుండగా పల్సర్ బైక్ ఢీ కొట్టడంతో గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ యల్లారావు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరుతో ఘరానా మోసం

- రూ.4 కోట్లకు టోకరా
- లబోదిబోమంటున్న బాధితులు



ఆందోళన చేస్తున్న బాధితులు

మొగల్తూరు, ఆగస్టు 6 : కేపీపాలెం సౌత్ గ్రామంలోని చిట్టీల పేరుతో ఒక వ్యక్తి మోసం చేసి పరారైనట్టు బాధితులు ఆందోళన చేస్తున్నారు. 9గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాసరావు అనే దివ్యాంగుడు చిట్టీలు వ్యాపారం అనధికారకంగా 2012 సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నాడు. చిటీలు వేసి డబ్బులు సక్రమంగా సరిపెడుతుండడంతో అతనిని నమ్మి వందలాది మంది చిట్టీలు వేసినట్టు బాధితులు తెలిపారు. తీరంలోని కేపీపాలెం, తూర్పుతాళ్ళు, మొగల్తూరు, రామన్నపాలెం, పీఎం లంక వంటి గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి పలువురు శ్రీనివాసరావు వద్ద చిట్టీలు వేశారు. అయితే చిట్టీలు పూర్తి అయినా కొందరికి డబ్బులు చెల్లించకపోవడం, పాడుకున్నవారికి సుమారు రూ. నాలుగు కోట్ల వరకూ చెల్లించకపోవడంతో బాధితులు రోడ్డున పడ్డారు. బాధితులు ఇంటి చుట్టూ తిరుగుతుండటంతో మూడు రోజుల క్రితం శ్రీనివాసరావు ఇంటి నుంచి ఉడాయించినట్టు తెలిసింది. శ్రీనివాసరావు అదృశ్యంపై పోలీసులకు అతని భార్య ఫిర్యాదు చేసిందని సెల్ ఫోన్ లోకేషన్ ఆధారంగా ఏలూరు సమీపంలో ఉన్న శ్రీనివాసరావు ఫిర్యాదు విషయం తెలుసుకుని గ్రామ పెద్దలకు వివరణ ఇచ్చేందుకు వచ్చినట్టు తెలిసింది. తాను కొంత మందికి డబ్బులు ఇవ్వాల్సి ఉందని మరికొందరి నుంచి డబ్బు వసూలు కావల్సి ఉందని సర్పంచ్ సమక్షంలో మాట్లాడతానని శ్రీనివాసరావు చెప్పడంతో సుమారు 100 మంది బాధితులు మంగళవారం సర్పంచ్ ఇంటి వద్దకు వచ్చి రావాల్సిన డబ్బుల వివరాలు తెలిపారు. సుమారు రూ. నాలుగు కోట్లకు పైబడి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని స్థానికులు అంచనా వేశారు ప్రభుత్వం స్పందించి మోసపోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఎంవీఎస్ శర్మ

భీమవరం అర్బన్, ఆగస్టు 6:అసమానతలు లేని సమాజం కోసం విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకుడు ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా యువజనుల ఆత్మీయ సదస్సు త్యాగరాజ భవన్‌లో మంగళవారం జరిగింది. యువజనులు చైతన్యంతో దేశభక్తితో ఆదర్శ సమాజ నిర్మాణానికి మూల స్తంభాలుగా ఉండాలన్నారు. పాశ్చాత్య వ్యామోహాన్ని విడనాడి మాతృదేశంపై మమకారంతో ఉండాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, నాయకులు ఎస్‌వీఎస్ శర్మ, బలరాం, జెఎన్‌వీ గోపాలన్, జి.ధనుష్, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు జేసీ అభిషేక్ పూజలు

భీమవరం టౌన్, ఆగస్టు 6 : పట్టణంలోని మావుళ్ళమ్మ అమ్మవారిని మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్ దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున శేషవస్త్రాన్ని ప్రసాదాన్ని అందించారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆచంట, ఆగస్టు 6 : ప్రభుత్వ ఐటీఐ ఆచంటలో 2024-25 విద్యా సంవత్సరం మూడో విడతగా.. మొదటి, రెండో విడతల్లో మిగిలిన సీట్ల కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఐటీఐలో చేరే విద్యార్థులు ధ్రువపత్రాల నకళ్లను స్వయంగా ఈనెల 26లోపు కళాశాలకు వెళ్లి అందజేయాలన్నారు. ఈనెల 29న జరిగే కౌన్సెలింగ్ నిమిత్తం అభ్యర్థులు ఉదయం పది గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్‌లు తీసుకుని కళాశాలకు హాజరు కావాలని మరిన్ని వివరాలకు 94901 11002లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

గణపవరం, ఆగస్టు 6: మండలంలో పేరుకుపోయిన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును గణపవరం మండల టీడీపీ నాయకులు కోరారు. అమరావతిలో మంగళవారం మంత్రిని కలిసి మండలాభివృద్ధికి, గ్రామాల అభివృద్ధికి తమ సహాయ, సహకారాలు అందించాలని వినతిపత్రం అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగ యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు తదితరులు ఉన్నారు.

డిగ్రీ కాలేజీలో జాతీయ చేనేత దినోత్సవం

గణపవరం, ఆగస్టు 6: చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. భారతీయ చేనేతపై టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ చిత్రీకరించిన మూడు డాక్యుమెంటరీ చిత్రాలను, 2017కి భారతదేశపు నాల్గవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ గ్రహీత చేనేత కార్మికులకు అవసరమైన యంత్రాన్ని కనుగొన్న మల్లేషం జీవిత కథ ఆధారంగా రూపొందించిన మల్లేషం చిత్రాన్ని ఈ సందర్భంగా ప్రదర్శించారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి, అధ్యాపకులు విద్యార్థులు తదతరులు పాల్గొన్నారు.

చర్మకారులకు రుణాలివ్వాలి

పెంటపాడు, ఆగస్టు 6: చర్మకార వృత్తిదారులందరికీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలివ్వాలని చర్మకార సంఘం జిల్లా అధ్యక్షుడు గాంధీ మంగళవారం ఎంపీడీవో బాలాజీ వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ చర్మకార వృత్తిపై వందల మంది జీవనం సాగిస్తున్నారని, అర్హులైన వారందరికి రుణాలు మంజూరు చేయించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్యులతో మాట్లాడుతున్న అధికారి రవికుమార్

పెంటపాడు, ఆగస్టు 6: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ కోసూరి రవికుమార్ అన్నారు. మంగళవారం ముదునూరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బం దితో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలపై ముందస్తు సర్వేలు నిర్వహించాలన్నారు. జ్వర పీడితులు ఎవరైనా ఉంటే వారికి తక్షణం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు, వైద్యులు డాక్టర్ పవన్, డాక్టర్ మౌనిక, డాక్టర్ అనీషా, సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యనిపుణలు

పెంటపాడు, ఆగస్టు 6: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 8న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. క్యాన్సర్, జనరల్, చిన్నపిల్లలు, స్త్రీల సంబంధిత వ్యాధులు, గుండె వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు, ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

'పెరటి కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి'

ఉండి ఆగస్టు 6: పెరటికోళ్ల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భీమవరం పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ జవహర్ హుస్సేన్ అన్నారు. మంగళశారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ జవహర్‌హుస్సేన్ మాట్లాడుతూ కోళ్లకు వ్యాధులు రాకుండా తగిన టీకాలు వేయించాలని సూచించారు. కొక్కెర, గంబారా, మసూచి వ్యాధులకు సమయం ప్రకారం టీకాలు వేయించాలని సూచించారు. వెంకట్రామన్నగూడెం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగరాజకుమారి మాట్లాడుతూ కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమగా చేపట్టవచ్చని సూచించారు. పలు మండలాల నుంచి యువత, మహిళలు విచ్చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ డిబోరా మెషియానా, శ్రీనివాసరావు, పి.వినయలక్ష్మి, బి.రజిత, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, ఆగస్టు 6: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందుల షాపు ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యాలయం ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు 29 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి రోగులకు సూచనలిచ్చారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

పేరుపాలెం నార్త్ ఎంపీటీసీ మృతి


సూరయ్య నాయుడు(ఫైల్)

మొగల్తూరు, ఆగస్టు 6 : పేరుపాలెం నార్త్ పంచాయతీ-2వ ఎంపీటీసీ సభ్యుడు కొమ్మూరి సూరయ్యానాయుడు (72) అనారోగ్యంతో మంగళవారం స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి సుబ్బారాయుడు, బందారు మాధవనాయుడు, ఎంపీపీ అందే సూర్యావతి భుజంగరావు, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మీ, మండల పరిషత్ సిబ్బంది సంతాపం తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం.. కేసుల నమోదు

కాళ్ళ, ఆగస్టు 6 : భర్త కనిపించడం లేదని భార్య, కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి ఫిర్యాదుల మేరకు రెండు అదృశ్యం కేసులు నమోదు చేశామని కాళ్ల పోలీసులు మంగళవారం తెలిపారు. బొండాడకి చెందిన జి.మోహనరావు గతనెల 23న బయటకు వెళ్లి వస్తానని తిరిగి ఇప్పటివరకు ఇంటికి రాకపోవడంతో భార్య మానస ఫిర్యాదు మేరకు హెచ్‌సీ బీవీ ప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎల్ఎన్‌పురం గ్రామానికి చెందిన బి.వీరప్రభ భర్తతో గొడవపడి సుమారు ఆరు నెలలుగా తన పుట్టింటి వద్ద తండ్రి దగ్గర ఉంటుంది. గతనెల 31వ తేదీన పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తన కుమార్తె ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల ఆచూకీ కానరావడంతో తండ్రి పి.తాతారావు ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జె.శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

చెరువుల్లా పల్లపు ప్రాంతాలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 6 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తాడేపల్లిగూడెం పట్టణంలోని పల్లపు ప్రాంతాల్లోకి మురుగునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పట్టణంలోని కడకట్ల, యాగర్లపల్లి, ఎఫ్‌సీఐ కాలనీ, హౌసింగ్ బోర్డు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రోజుల తరబడి ఇదే విధంగా పల్లపు ప్రాంతాలు నీటితో నిండి ఉంటున్నాయి.

ఉండి : ఇటీవల కురిసిన వర్షాలకు వెలివర్రు ఆర్అండ్‌బీ రహదారి వర్షాలకు గోతులమయంగా మారింది. ఉండి నుంచి వెలివర్రు మీదుగా చిలుకూరు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి, వెలివర్రు గరువు నుంచి మహదేవపట్నం వెళ్లే రహదారి అధ్వానంగా మారాయి.


తాడేపల్లిగూడెం ఎఫ్‌సీఐ కాలనీలో పరిస్థితి


వెలివర్రు ఆర్అండ్‌బీ రహదారి


కడకట్ల ప్రాంతంలో వర్షపునీరు







వదలి, పెంటపాడుల్లో తల్లిపాల వారోత్సవాలు.. ఆచంటలో బాలింతకు బేబీ కిట్‌లు, పండ్లు అందజేస్తున్న మానవత సభ్యులు

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెంపు

పెనుగొండ, ఆగస్టు 6 : పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నియంత్రిస్తుందని, బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూతు కుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని వదలి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

- పెంటపాడు : శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సుజాత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పెంటపాడులో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- కాళ్ల : తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఏలూరుపాడు గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లులు, గర్భిణులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో వాణీవిజయరత్నం మాట్లాడుతూ గర్భిణులు ప్రసవమైన తరువాత గంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్‌లక్ష్మీ, ఏఎం లక్ష్మీ, కాశీరత్నం, భవాని, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.
- నరసాపురం రూరల్ : కొప్పర్రు సచివాలయం వద్ద మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. వంద రోజుల మిషన్‌శక్తిలో భాగంగా అంగన్‌వాడీలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పట్టణం, మండలంలో తల్లిపాల విశిష్టతను తెలిపే విధంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో ఐసీడీఎస్ సీడీపీవో టీఎల్ సరస్వతి ఆధ్వర్యంలో 33వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం వద్ద, కడకట్ల, 23వ వార్డు, కుంచనపల్లి, అప్పారావుపేట, వెంకటరామన్నగూడెంలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కూటమి నాయకులు, సూపర్‌వైజర్‌లు దుర్గాభవాని, విశాలాక్షి, ఎస్తేరురాణి, శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బేబీ కిట్‌లు, పండ్ల పంపిణీ

- ఆచంట :ఆచంట మండల మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని గంధం ధనలక్ష్మి, వేండ్ర దేవి ఇద్దరు బాలింతలకు బేబి కిట్‌లు, పండ్లు, ఔషధాలు కమిటీ సభ్యులు అందజేశారు. మానవత అధ్యక్షుడు కుక్కల లీలాప్రసాద్, నంబూరి అంజిబాబు, బొక్కా రామకృష్ణ, నిమ్మకాయల గంగాధర్, కొమ్మనపెద్ది సూర్యనారాయణమూర్తితో పాటు డాక్టర్ వై.యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

పాలకొల్లు అర్బన్/భీమవరం రూరల్/తణుకు, ఆగస్టు 6 : పాలకొల్లు తహసీల్దార్‌గా యడ్ల దుర్గాకిషోర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం తహసీల్దార్‌గా రావి రాంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ పవన్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. తణుకు మండల తహసీల్దార్‌గా డీవీవీఎస్ అశోక వర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది ఆయనను అభినందించారు. అశోకవర్మ ఇదే కార్యాలయంలో సీఎస్ డీటీ, ఎన్నికల డీటీ పనిచేస్తూ పదోన్నతిపై పెనుమంట్ర తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. అనంతరం ఎన్నికల నిమిత్తం తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం తణుకు పట్టణానికి బదిలీపై వచ్చారు.

పాలకొల్లు రూరల్ సీఐగా శ్రీనివాసరావు

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గుత్తుల శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తనపరిధిలో నేరాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటానన్నారు. రూరల్ ఎస్ఐ, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వీరవాసరం వీఈసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రభువరం

భీమవరంటౌన్, ఆగస్టు 6 :వీరవాసంలోని ఎస్వీఎస్అండ్‌వీఈసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్ ప్రభువరం మంగళవారం బాధ్యత స్వీకరించారు. వీఈసీ జూనియర్ కళాశాల ప్రభుత్వ కళాశాలగా మారిన అనంతరం ఇంటర్ బోర్డు నుంచి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.కృష్ణకాంత్‌ను నియమించారు. ఆయనను ఇటీవల డిప్యూటేషన్‌పై ఇంటర్మీడియట్ బోర్డులో విధుల నిర్వహణకు నియమిస్తూ బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీనియర్ అధ్యాపకుడైన ప్రభువరంను ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

కలవపూడిలో చెత్త సేకరణకు ట్రాక్టర్ అందజేత

కాళ్ళ, ఆగస్టు 6 :గ్రామంలో పారిశుధ్య సమస్యను అధిగమించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని కలవపూడి గ్రామ పెద్దలు అన్నారు. కలవపూడి పంచాయితీలో చెత్త సేకరణకు టీడీపీ నాయకులు మంతెన వెంకటశివాజీరాజు, మంతెన పెదనరసింహరాజు, సర్పంచ్ గేదెల జాన్, రైతులు అందించిన ట్రాక్టర్‌ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత శివాజీరాజు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతీ ఒక్కరూ బాధ్యత వహించాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సూచనల మేరకు సుమారు రూ.4లక్షలతో ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి పంచాయతీకి అందించారు. ఏడాది పాటు ట్రాక్టర్‌కు అయ్యే మెయింటెనెన్స్ తామే భరిస్తామన్నారు. ట్రాక్టర్‌ను అందించిన దాతలను పెద్దలు అభినందించారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

నరసాపురం టౌన్, ఆగస్టు 6: రాష్ట్రంలో వరద ముంపు బాధితులతో పాటు కేరళలోని వయనాడ్ బాధితులకు తనవంతు సాయంగా సీపీఎం నాయకులు విరాళాలు సేకరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని వ్యాపారుల వద్ద వెళ్లి విరాళాలు అందించాలని కోరారు. దీనికి స్పందించి రూ.18,150 వరకు ఆర్థిక సాయం అందించారు. సేకరించిన మొత్తాన్ని రాష్ట్ర కమిటీ ద్వారా బాధితులకు అందిస్తామని ఎం.త్రిమూర్తులు తెలిపారు. పి.రాము, పి.నారాయణరావు, అప్పలనాయుడు, రామలింగం, మల్లేష్, దుర్గారావు పాల్గొన్నారు.

జెసికిలీ స్కూల్ వద్ద ఉద్రిక్తత

నరసాపురం, ఆగస్టు 6; పట్టణంలోని జెసికిలీ స్కూల్ వద్ద మంగళవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన విద్యార్థికి శ్రేష్ఠ పథకం క్రింద సికిలే స్కూల్‌లో సీటు వచ్చింది. ఆ విద్యార్థి తల్లి స్వాతితో కలసి సోమవారం స్కూల్‌కు వచ్చారు. యాజమాన్యం ఆ విద్యార్థికి సీటు ఇవ్వలేదు. తల్లి స్వాతి పోలీసుల్ని, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలసి న్యాయం చేయాలని కోరింది. మంగళవారం సాయంత్రం ఆ విద్యార్థికి అండగా జనసేన నాయకులు స్కూల్ వద్దకు వెళ్లి యాజమాన్యంతో చర్చించారు. సమయం అయిపోయిందని చెప్పడంతో ఆందోళనకు దిగారు. చివరికి కరస్పాండెంట్ పెర్సిపాల్.. ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లి జరిగిన విషయాన్ని వివరించారు. బుధవారం ఢిల్లీలోని సీబీఎస్‌సీ అధికారులతో చర్చించి విద్యార్థికి సీటు వచ్చేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. దీంతో జనసేనకులు ఆందోళనను విరమించారు. కరస్పాండెంట్ వివరణ ఇస్తూ అంతా రూల్ ప్రకారం జరిగిందని, విద్యార్థి అలస్యంగా రావడంతో సమస్య తలెత్తిందన్నారు.

ఆధ్యాత్మికం

బాలాత్రిపుర సుందరికి పూలతో అలంకరణ



భీమవరంటౌన్, ఆగస్టు 6 : శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా మెంటేవారి తోటలోని శ్రీచక్రసహిత బాలా త్రిపురసుందరీ అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు దర్శించుకున్నారు.

పంచముఖాంజనేయ స్వామికి పూజలు

పాలకొల్లుఅర్బన్ : శ్రావణ మాసం తొలి మంగళవారం రోజున స్థానిక యడ్లబజారులోని పంచముఖాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కెనాల్ రోడ్డులోని దాసాంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణగావించారు.

'ఉపాధి'లో అవకతవకలు లేకుండా చూసుకోవాలి


మాట్లాడుతున్న ప్రభాకరరావు

పెంటపాడు, ఆగస్టు 6: ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా చూసుకోవాలని డ్వామా పీడీ ఎం.ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 2023-24కు సంబంధించి ఉపాధి పనులు, పెన్షన్లు, హౌసింగ్ తదితర అంశాలపై జరిగిన సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీలు నిర్వహించిన సిబ్బంది తమ నివేదికను అధికారులకు అందజేశారు. మండలంలో ఉపాధి, హౌసింగ్ పనులపై రూ.25,545 లు రికవరీ జరగాల్సి ఉందని, అలాగే గ్రామాల్లో కొంత మంది అనర్హులకు పెన్షన్లు ఇస్తున్నారని నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ రికవరీని త్వరగా పూర్తిచేయాలని, ఉపాధి పనుల రికార్డులను ఎప్పకప్పుడు సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎంపీపీ దాసరి హైమవతి, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, టీఏ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని ధర్నా

నరసాపురం రూరల్, ఆగస్టు 6:ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల బకాయిలను తక్షణం చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ చెల్లింపుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. డబ్బులు రాకపోవడం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావుకు వినతిపత్రం అందించారు. కవురు పెద్దిరాజు, నాగేశ్వరరావు, కామేశ్వరరావు, రవి, శ్రీనివాస్, వేణు, జయలక్ష్మి, తాతాయ్య పాల్గొన్నారు.

'పస్తుల సాగరం' పోరాటం స్ఫూర్తిదాయకం

భీమవరంటౌన్, ఆగస్టు 6 : భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పట్టణానికి చెందిన పస్తుల సాగరం పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య దిన పక్షోత్సవాలను చినరంగనిపాలెం పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీచే ప్రశంసలు అందుకున్న సాగరం ఉద్యమంపై సదస్సు, జాతీయ జెండాలతో ర్యాలీ, పస్తుల సాగరం కుటుంబ సభ్యులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగరం మనుమడు పస్తుల హరిప్రసాద్ మాట్లాడుతూ భీమవరంలో జన్మించిన మా తాత సాగరం ఉద్యమంలో పాల్గొనడం మా కుటుంబానికి గౌరవం అందిందన్నారు. హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బొక్కా గోపీనాథ్ పస్తుల సాగరం జీవిత చరిత్రపై మాట్లాడారు. అనంతరం ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, సీపీఐ నాయకులు మల్లుల సీతారామ్ ప్రసాద్, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. విద్యార్థులకు గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం వస్తుందా ? అనే అంశంపై వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. పస్తుల సాగరం ముని మనుమడు రఘురామ్, నరహరిశెట్టి కృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో శాస్త్రవేత్తల బృందం పరిశీలన


పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

పాలకొల్లు రూరల్ , ఆగస్టు 6 : మండలంలోని పలు గ్రామాల్లో సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగుచేస్తున్న పంట పొలాలను పలువురు శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారులు మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, సహజ వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న చింతపర్రు, అరటికట్ల, కాపవరం, వాలమర్రు గ్రామాల్లోని రైతుల పొలాలను సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ సెంటర్ అధికారి బాలగంగాదేవి, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు, అరుణకుమారి తదితరులు సాగు విధానం పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫిష్, వరి, వరల్డ్ ఫిషనరీ ఆర్గనైజేషన్ నుంచి డాక్టర్ అయోన్, మోహన్, రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జడ్ సి.వీరాస్వామి, టీం లీడర్ మురళీకృష్ణ, డీఏ అప్పారావు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

పాలకొల్లు రూరల్, ఆగస్టు 6 :భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే కూటమి ప్రభుత్వం వరి విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తోందని కూటమి నాయకులు అన్నారు. మండలంలోని పాలకొల్లు రూరల్ వరధనం గ్రామంలో మంగళవారం రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించారు. రైతులకు ఏవిధంగా కష్టం వచ్చినా ఆదుకుంటామని మంత్రి డాక్టర్ నిమ్మల ఆదేశాలతో విత్తనాలను అందిస్తున్నామన్నారు. కూటమి నాయకులు కోడి విజయభాస్కర్, పాముల రజనీకుమార్, నెక్కంటి ఆదినారాయణ, ఇంటి శ్రీరాముడు, అందే కోటివీరభద్రం, శాగా సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, పోతుల సూరిబాబు, రాయి ప్రసాద్, వర్ధనపు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు పాస్‌ల వితరణ

ఇరగవరం, ఆగస్టు 6 : తూర్పు విప్పర్రు జడ్పీ హైస్కూలులోని 60 మంది విద్యార్థులకు జనసేన నాయకుడు, సర్పంచ్ తమ్మిశెట్టి సత్యనారాయణ బస్‌పాస్‌ల వితరణ చేశారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం యలమర్తి గుప్త, డ్రాయింగ్ టీచర్ తానేటి రఘు, డిపో ఉద్యోగి ములగాల వెంకటరత్నం పాల్గొన్నారు. దాత తమ్మిశెట్టి సత్యనారాయణకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

జన సైనికుల భద్రత, భరోసా జనసేన లక్ష్యం


కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, ఆగస్టు 6 : జన సైనికులకు భద్రత, భరోసా జనసేన లక్ష్యమని, పార్టీ సభ్యత్వాలు నియోజక వర్గంలో అద్భుతంగా జరిగాయని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆయన మాట్లాడారు. గొల్లవానితిప్ప గ్రామంలో ఎంపీటీసీ తాతపూడి రాంబాబు 500కుపైగా సభ్యత్వాలు చేయించారని, నియోజకవర్గంలో 14 వేలకు పైగా సభ్యత్వాలు చేయించడం అభినందనీయమన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, భీమాల శ్రీరామ్మూర్తి, పొత్తూరి బాపిరాజు, కారుమూరి సత్యనారాయణ, ఎంపీటీసీ ఆరేటి వాసు, చల్లా రాము, కొప్పినీడి బాబి, రాట్నాల శ్రీనివాసరావు, పోకల కిషోర్, మాదాసు సాయి, యడ్లపల్లి రాంబాబు, చిట్టి కోడవటి శివ ప్రసాద్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

15న అన్నక్యాంటీన్లు ప్రారంభం


అన్నసమారాధనలో ఎమ్మెల్యే బొలిశెట్టి, బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 6: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపానగల అన్న క్యాంటీన్ వద్ద మంగళవారం టీడీపీ వార్డు ఇన్‌చార్జిల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పండుగ వాతావరణంలో ప్రారంభమవుతాయన్నారు. కిలపర్తి వెంకట్రావు, వాడపల్లి సుబ్బరాజు, బండి పెద్దిరాజు, పాలూరి వెంకటేశ్వరరావు, షేక్ బాజి, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

- క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వాసవీ కళాశాలలో కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో భీమవరం వీహెచ్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఎన్.సుధీర్‌వర్మ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి క్యాన్సర్ ఉచిత పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

అందరూ బాగుండాలని శ్రీవారిని వేడుకున్నా : ఆరిమిల్లి


శ్రీవారి ఆలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి దంపతులు

తణుకు, ఆగస్టు 6: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం బాగుండాలని తిరుమల తిరుపతి వేంకటే శ్వర స్వామిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని, అందరికీ మేలు కలగాలని కోరుకున్నామని వివరించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి కృష్ణతులసీ, కుమారుడు నిఖిల్ రత్న స్వామి వారిని దర్శించుకున్నారు.

'హలో మాల.. చలో ఢిల్లీ'కి తరలిరండి

ఆచంట, ఆగస్టు 6 :ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సుప్రీంకోర్టు అవలంబించిన ఎస్సీ వర్గీకరణ విషయంలో రాజ్యాంగ విరుద్ధంగా చేసిన ప్రకటనకు వ్యతిరేకంగా ఈ నెల 8,9,10 తేదీలలో 'హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నై ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో రీపిటిషన్ వేసి పోరాటం చేయనున్నారని దానికి జాతీయ పార్టీ నాయకులు మద్దతు తెలపాలన్నారు. తెలుగు రాష్ట్రాల మాలలు, మేధావులు, విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాఉద్యమ నేత గద్దర్‌కు ఘన నివాళి

నరసాపురం టౌన్, ఆగస్టు 6 : గాయకుడు, ప్రజా ఉద్యమ, దళిత నాయకుడు గద్దర్ వర్ధంతిని మంగళవారం దళిత మాల సంఘాల నాయకులు నిర్వహించారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో వర్ధంతి సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుదిశ్వాస విడిచే వరకు ప్రజల కోసం ఉద్యమాలు, పోరాటాలు చేసిన మహనీయుడు గద్దర్ అన్నారు. కార్యక్రమంలో ఇంజేటి కెనడి, భాస్కర్, దొండపాటి స్వామి, శ్రీధర్, కాకిలేటి ఆనంద్, హెన్నీ, ఏసురత్నం, అడిదెల శరత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ టీచర్ల సంఘ ఉపాధ్యక్షుడిగా సుబ్బారాయుడు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 6 : రాష్ట్రస్థాయి డీఎస్సీ-98, ఎంటీఎస్‌ల ఆత్మీయ సమావేశం ఇటీవల విజయవాడలో జరిగిందని డీఎస్సీ 98 క్వాలిఫైడ్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.సుబ్బారాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎంటీఎస్ టీచర్లు హాజరయ్యారన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా తమ సంఘం ఎస్టీయూకి అనుబంధసంఘంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వై.సుబ్బారాయుడు, ఫైనాన్స్ సెక్రటరీగా టీపీగూడెంకు చెందిన కె.మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు.

ప్రొఫెసర్ పవన్‌కుమార్ వర్మకు డాక్టరేట్

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 6 : వెల్డింగ్ టెక్నాలజీపై పరిశోధనలు చేసిన మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.రామ పవన్‌కుమార్‌వర్మకు ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ ప్రదానం చేసిందని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. కళాశాల మేనేజ్మెంట్ మీటింగ్ హాల్లో డాక్టర్ పవన్‌కుమార్ వర్మను కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ యాజమాన్యం తరపు ఘనంగా సత్కరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వర్మకు అభినందనలు తెలిపారు.

రేషన్ సక్రమంగా అందించండి

పాలకోడేరు, ఆగస్టు 6 :ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా నిత్యావసర వస్తువులు అందించాలని పాలకోడేరు మండల తహసీల్దార్ భారతీ విజయలక్ష్మి అన్నారు. పాలకోడేరు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె మంగళవారం మండల రేషన్ డీలర్ల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆమె మాట్లాడతూ ఎటువంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. రేషన్ డీలర్ల మండల అసోసియేషన్ అధ్యక్షుడు దొంగా కృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, కోశాధికారి సత్యనారాయణ, కవిత, సూరిబాబు, మాణిక్యంతో పాటు సీఎస్‌డీటీ శేషయ్య ఉన్నారు.

నరసాపురం టౌన్ సీఐగా యాదగిరి బాధ్యతలు

నరసాపురం, ఆగస్టు 6: నరసాపురం టౌన్ సీఐగా మంగళవారం యాదగిరి బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా అయినవిల్లి, అమలాపురం ప్రాంతాల్లో పని చేశారు. గత ఏడాది సీఐగా పదోన్నతి పొందారు. తొలి పోస్టింగ్ ఇదే కావడం గమనార్హం, ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన సీఐ స్వామి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. పెండింగ్ కేసుల్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఆయనను ఎస్ఐలు, పలువురు సిబ్బంది అభినందించారు.

'హిరోషిమా'పై దాడి చరిత్రలో దుర్దినం

పాలకొల్లుఅర్బన్, ఆగస్టు 6 :హిరోషిమా నగరంపై అమెరికా చేసిన దాడి అమానుషం, దుర్దినంగా చరిత్రలో నిలిచిపోతుందని స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.కృష్ణ అన్నారు. 1945 ఆగస్టు 6న హిరోషిమా నగరంపై ప్రపంచంలోనే తొలి అణుబాంబుతో దాడికి దిగిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌కు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు వంశి, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ విజయలక్ష్మి, కామర్స్ విభాగం అధ్యాపకురాలు దుర్గేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.